క్లుప్తంగా

ఉత్సాహంగా ఒలింపిక్ రన్



సామర్లకోటలో ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న సభ్యులు

సామర్లకోట: ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉత్సాహంగా ఒలింపిక్ రన్ జరిగింది. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్ వరకూ నిర్వహించిన రన్‌ను విశ్రాంత పీడీ, ఒలింపిక్ రన్ ప్రతినిధి తాళ్లూరి వైకుంఠం ప్రారంభించారు. అనంతరం ఈ రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయురాలు ఏఎల్‌వీ కుమారి, కౌన్సిలర్ బలుసు వాసు, పీఈటీలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మించవద్దంటూ నిరసన



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గుడివాడ ప్రజలు

పెద్దాపురం: అనుమతులు లేకుండా ఇళ్ల మధ్య చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలంటూ గుడివాడ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తమ గ్రామంలో సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ శివారులో జూదమాడుతున్న ఎనిమిది మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడకు వెళ్లి దాడి చేయగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.32,260 స్వాధీనం చేసుకున్నామన్నారు.

శరీరానికి తగినంత నీరు అవసరం

కాకినాడ రూరల్: మనిషి శరీరానికి రోజూ తగినంత నీరు అందించాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. జాతీయ హైడ్రేషన్ దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

కరప: తమ కుమార్తె ఆచూకీ 15 రోజులైనా లభించలేదని, కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులకు, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌లకు ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కరప వచ్చి స్థిరపడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నాయి. స్థానిక పాఠశాలలో చదువుతున్న పెద్దమ్మాయి (15)ను తమ ఇంటి పక్కనే ఉండే బుద్ధాల చిన్నారావు కుమారుడు షణ్ముఖ మణికంఠ (23) ఈ నెల 8న తీసుకెళ్లిపోయాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయాన్ని అదేరోజు రాత్రి కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇంతవరకూ తమ కుమార్తె ఆచూకీ తెలియ రాలేదన్నారు. ఆ వ్యక్తి తమ కుమార్తెను చంపేస్తాడేమోనని భయపడుతున్నామని బాధిత తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పలువురికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 9 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో 20 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

బోట్‌క్లబ్: రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు జూలై 1 నుంచి మూడు నెలల పాటు ఉచిత యోగా, స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ ఇస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిగురు యోగాపీఠం వ్యవస్థాపకుడు సచ్చిదానందయోగి ఆధ్వర్యంలో యోగా తరగతులు, జె.అరవింద్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులై, తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు ఈ శిక్షణ ఇస్తామన్నారు. మొదట 50 మంది ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు 91826 60025 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఈ కొనుగోల ఏంటో!

- విత్తనాల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- ఆఫర్లతో రైతులకు ఎర వేస్తున్న కంపెనీలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు



విత్తనాలు జల్లుతున్న రైతులు (ఫైల్)

కొత్తపల్లి: నకిలీ విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు పుడమి పుత్రులపై కన్నెర్రజేస్తుంటే, మరోపక్క నకిలీల జోరు సాగును సంక్షోభంలోకి నెట్టేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని సేవలు అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక విత్తనాలు, ఎరువులను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి రావడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఏదేమైనా అప్రమత్తతే ఆయుధంగా సాగులో ముందుకు సాగాలని వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తున్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. వర్షాలు పడుతుండడంతో దుక్కిదున్ని నారుమడులకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీల విత్తనాలు, పురుగు మందుల ప్రచారం జోరందుకుంది. పుట్టగొడుగుల్లా వచ్చిన ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే పనిలో పడ్డాయి. కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. కొత్తపల్లి మండలంలో 10,254 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. సుమారు 6,073 మంది రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

ఆఫర్లే ఆఫర్లు..

పలు కంపెనీల యాజమాన్యాలు ఎరువు దుకాణ డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ టూర్లు, ఆఫర్ చేస్తుండడంతో వారు రైతులకు ఎక్కువ మోతాదులో సదురు కంపెనీల విత్తనాలను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం, ఆ తర్వాత మోసపోవడం షరామామూలైంది. అంతా అయ్యాక ఇబ్బందిపడే కన్నా ముందే మేల్కొంటే మంచిదని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

మోతాదు మించితే నష్టాలే..

రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో విత్తనాలతో పాటు ఎరువులను మోతాదుకు మించి వినియోగిస్తుంటారు. ఇలా చేయడంతో లాభాల కన్నా నష్టాలే చవిచూడాల్సిన వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులను అధిక మోతాదులో వినియోగిస్తే అనర్థమేనని అంటున్నారు. భూమిలో పోషకాల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వేయడం ఉత్తమమని సూచిస్తున్నారు. రైతులు ముందు జాగ్రత్తలు పాటించి సాగు చేయాలని పేర్కొంటున్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

మొలక శాతం పరిశీలించాకే..



కొత్తపల్లి మండలంలో లైసెన్స్ ఉన్న 16 ఫెర్టిలైజర్ షాపులు ఉన్నాయి. కొనుగోలు చేసిన వెంటనే రశీదు తప్పకుండా తీసుకోవాలి. పంట బీమా వర్తించాలంటే రశీదు తప్పనిసరి. ఫెర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలి. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల్లో తొలుత 100 గింజలు తీసుకుని మొలక శాతాన్ని పరీక్షించుకోవాలన్నారు. సుమారు 80 శాతం పైగా మొలకెత్తిన విత్తనాలను మాత్రమే ఉపయోగించుకోవాలి. అలాగే విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి.

– వి.జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

భీమేశ్వరా... సర్వేశ్వరా



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారా రామ భీమేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జేష్ఠ మాసం త్రయోదశి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, ఉప ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయానికి తెల్లవారు జాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భారీగా భక్తులు వేచిఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదంగా, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మఠం సెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, గొంచాల, పీబీ దేవంలలోని శివాలయాల్లో పూజలు జరిగాయి.

యువత పోరు విజయవంతం: వంగా గీత



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్



పిఠాపురం నుంచి ర్యాలీగా బయలు దేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- పిఠాపురం నుంచి కాకినాడకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పిఠాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా, ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని వైఎస్సార్ సీపీ పోరాటానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన యువత పోరు నిరసన కార్యక్రమం విజయవంతం అయ్యిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ తెలిపారు. తొలుత ఈ కార్యక్రమం విజయవంతానికి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతో పాటు పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత సోమవారం ఉదయం పిఠాపురంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వంగా గీత ఆధ్వర్యంలో ర్యాలీగా కాకినాడ వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్క విద్యార్థికి తల్లికి వందనం ఇస్తామని కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించి నిలువునా ముంచేసిందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మొండిచేయి చూపిందన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు తీసేస్తుందన్నారు. తక్షణం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, లేకుంటే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

తరలివెళ్లిన యువకులు

సామర్లకోట: కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరుకు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున యువకులు తరలివెళ్లారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ. మూడు వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపు మేరకు సోమవారం నియోజకవర్గ నలుమూలల నుంచి యువత స్థానిక పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కరణం రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు వీరంరెడ్డి వెంకయ్యల ఆధ్వర్యంలో కాకినాడకు తరలి వెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ర్యాలీ సాగింది.



యువత పోరుకు సామర్లకోట నుంచి తరలివెళ్తున్న యువకులు

సమష్టి సహకారంతో ప్రగతి



సమావేశంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

పెద్దాపురం: సమష్టి సహకారంతో మండలాన్ని ప్రగతి పథాన నిలుపుదామని ఎంపీపీ పెంకే సత్యవతి అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీఓ శ్రీలలిత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిధుల కొరతతో చాలా గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. ఇక నుంచి నిధుల కొరతను అధిగమించి అభివృద్ధి వైపు గ్రామాలను నడిపిద్దామన్నారు. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి అవసరమన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉషా, ఇన్‌చార్జి ఉద్యాన శాఖ అధికారి ఎం.చిలకమ్మ, వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పోకనాటి నాగలక్ష్మి, భద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బి.తనుశ్రీ



వై.అనూష



ఎస్.భార్గవ్



బైలప్రియాంక



నాగహారిక



కె.గాయత్రి

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



భాగ్యప్రభకు మిఠాయి తినిపిస్తున్న ఉపాధ్యాయురాలు

సామర్లకోట: ట్రిపుల్ ఐటీకి బాలికలు ఎక్కువగా సీట్లు సాధించారని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య సోమవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన రాయి బైల ప్రియాంక, సామర్లకోట జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని నాగ హారికలు నూజివీడులో, సామర్లకోట జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన కె.గాయత్రి, బీబీఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన భాగ్యప్రభలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. అలాగే స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించారని హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. బి.తనుశ్రీ, నూజివీడులో, వై.అనూష, ఎస్.భార్గవ్‌లు శ్రీకాకుళం క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారన్నారు. వీరిని ఎంఈఓలు శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్ అభినందించారు.

అభివృద్ధి చేస్తే ఆరోపణలకు దిగుతారా!

- మున్సిపల్ నిధులతోనే పట్టణ ప్రగతి
- ఎమ్మెల్యే నిధులు ఏం ఇచ్చారో చెప్పాలి
- వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రశ్న



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మోజెస్, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ నిధులతోనే 2019 నుంచి పట్టణ అభివృద్ధి జరిగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ స్పష్టం చేశారు. అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిల్ పని చేస్తుందని, తాము అడ్డుకుంటే అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తాము ఖండిస్తే టీడీపీ నాయకులు సమాధానం ఇవ్వడం వింతగా ఉందన్నారు. బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప కౌన్సిల్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడంతోనే దానిని ఖండించామని చెప్పారు. బీపీఎస్, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో అభివృద్ధి జరిగితే అవి మున్సిపల్ నిధులు కాదా అని మోజెస్ ప్రశ్నించారు. కౌన్సిల్ సభ్యుల సూచన మేరకు లారీ స్టాండ్ రోడ్డు, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, గణేష్ కాలనీ, ప్లీడర్‌గారి తోటలో రోడ్లకు బీపీఎస్ నిధులు కౌన్సిల్ ఆమోదంతోనే ఖర్చు చేశామన్నారు. కౌన్సిల్‌లో తీర్మానం చేస్తేనే పనులు ముందుకు సాగుతాయన్నారు. పట్టణంలో 30 కల్వర్టులు తామే వేశామని టీడీపీ నాయకులు చెప్పుకొంటున్నారని, దానికి ఖర్చు చేసిన నిధులు ఏంటని అన్నారు. ఎమ్మెల్యే నిధులు ఏం తెచ్చారో చెప్పాలన్నారు. 2024 నుంచి 2025 వరకూ ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని మోజెస్ సవాల్ విసిరారు.

కౌన్సిలర్లను అవమానపర్చడం సరికాదు

కౌన్సిలర్లను అవమానపర్చే విధంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడటంతోనే తాము ఆ వ్యాఖ్యలను ఖండిస్తే, ఆ రెండు రోడ్లకే కౌన్సిల్ పరిమితమని టీడీపీ నాయకులు అనడం వింతగా ఉందని సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. 2019 నుంచి వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఏ నాడూ ఎమ్మెల్యేను కించపర్చే విధంగా మాట్లాడలేదన్నారు. సామర్లకోట నడిబొడ్డులో వేలాది గృహాలతో జగనన్న కాలనీ నిర్మిస్తే, అది అభివృద్ధి కాదా అని ఆవాల ప్రశ్నించారు. నాలుగేళ్లలో ప్రతి వార్డులో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలతో పనులు చేశామని చెప్పారు. తాము అభివృద్ధిని అడ్డుకుంటున్నామని ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, తాము అడ్డుకుంటే పనులు ఏవిధంగా జరుగుతున్నాయని అన్నారు. డిప్యూటీ సీఎంగా చినరాజప్ప ఉన్న సమయంలో సామర్లకోట–పెద్దాపురం రోడ్డు విస్తరణ చేశామని చెప్పుకొంటున్నారని, అయితే విశాలంగా ఉన్న రోడ్డునే చేశారని, విఘ్నేశ్వర థియేటర్ నుంచి స్టేషన్ సెంటర్ వరకూ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. టీడీపీ నాయకుల ఆస్తులకు ఆటంకం కలగకూడదనే అక్కడ విస్తరణ జరగలేదనే విషయం వాస్తవం కాదా అని అన్నారు. మహిళా కౌన్సిలర్లను చులకన చేస్తూ బాధ్యత కలిగిన ఎమ్మెల్యే మాట్లాడటం బాధగా ఉందని కౌన్సిలర్ కానేటి రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్ కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు పెండ్యాల వెంకటలక్ష్మి, వారా పాప, జట్ల మోహన్, యార్లగడ్డ జగదీష్, సేపెని సురేష్, మర్రి శేషారావు, గుబ్బల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, నాయకులు వారా సుధాకర్, లింగం శివప్రసాద్, దూది రాజు, పుట్టా సూరిబాబు పాల్గొన్నారు.

సత్యదేవునికే టెండర్

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్రాల గదులలో ఉపయోగించే దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను నెలకు రూ.45 వేలుకే ఉతుకుతామని స్థానిక రజక వృత్తిదారుడు కింతాడ శ్రీనివాస్ దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాలుగు నెలలుగా దేవస్థానం వీటిని నెలకు రూ.60 వేల చొప్పున చెల్లిస్తూ ఉతికిస్తోంది. ఎటువంటి టెండర్ పిలవకుండా ప్రజాప్రతినిధి సిఫార్స్ మేరకు నామినేషన్ మీద ఈ పని కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.

గతంలో మెషీన్లతో..

దేవస్థానంలో రెండేళ్లపాటు పారిశుధ్య కాంట్రాక్ట్ నిర్వహించిన కేవీటీఎస్ సంస్థ గత ఫిబ్రవరి నెలాఖరు వరకు సత్రం గదులలో మంచాలపై వేసిన దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను వాషింగ్ మెషీన్ల ద్వారా ఉతికించేది. పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్ట్ కోసం అన్ని దేవస్థానాలకు కలిపి టెండర్ పిలుస్తామని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి సర్కార్ గత ఏడాది ఆగస్టులో ప్రకటించింది. ఆ మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారిగా టెండర్ నిర్వహించారు. ఈ టెండర్ దరఖాస్తులో పొందుపరిచిన షరతులపై టెండర్‌దారులు అభ్యంతరం చెప్పడంతో ఆ నోటిఫికేషన్ రద్దు చేసి మరలా 13న టెండర్‌కు పిలిచారు. ఈ టెండర్లు ఖరారయ్యే వరకు దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణను నామినేషన్‌పై గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీస్‌కి అప్పగించారు. మూడు నెలలుగా ఆ సంస్థ 349 మంది సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ చేస్తున్న విషయం, ఆ సిబ్బంది జీతాలు ఆలస్యమవుతున్న విషయం తెలిసిందే. గత మార్చి నుంచి సత్రాలలో దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లు ఉతికేందుకు గాను నాలుగు నెలలుగా నెలకు రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అవి ఉతికేందుకు మెటీరియల్‌ను దేవస్థానమే అందజేస్తోంది. ఈ పని కూడా దేవస్థానం అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్ పిలవకుండా కూటమి పార్టీ నాయకులే చేయిస్తున్నట్లు సమాచారం. కేవీటీఎస్ సంస్థ వాషింగ్ మెషీన్ల ద్వారా వీటిని ఉతికించేది. ప్రస్తుతం మనుషులు ఉతుకుతుండడంతో శుభ్రంగా ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

ఏజెన్సీ ద్వారా మధ్యాహ్న భోజనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీ సంస్థ ద్వారానే సరఫరా చేయాలని మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలు సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా శాఖా కార్యాలయంలో ఎంఈఓ-2 పి.పుల్లయ్య ఆధ్వర్యంలో హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఇటీవల యోగా కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు నాసిరకం అల్పాహారం సరఫరా కావడంతో సర్వత్రా విమర్శలకు దారితీసింది. మండలంలో 61 పాఠశాలకు గాను 13 పాఠశాలలకు ఏజెన్సీ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా అవుతుంది. దాంతో వారి అభిప్రాయం సేకరించడానికి సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ ద్వారా వస్తున్న భోజనం నాణ్యత ఉంటుందని, అయితే పాఠశాలలకు కొన్ని సమయాల్లో ఆలస్యంగా చేరుతుందని హెచ్ఎంలు తెలిపారు. హైస్కూల్స్‌లో మధ్యాహ్న భోజనం తయారీకి ప్రత్యేకంగా ఏజెన్సీ ఏర్పాటు చేసి వారి ద్వారా వంటలు చేయించడానికి సామగ్రి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇది ప్రస్తుత పరిస్థితిలో సాధ్యం కాదని ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. దాంతో ఏజెన్సీ ద్వారానే మధ్యాహ్న భోజన వచ్చే విధంగా తీర్మానం చేశారు. సమావేశంలో హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, టి.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ క్రీడా మైదానంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూద ఏథెన్స్‌లో ఒలింపిక్ క్రీడలు ప్రారంభానికి సూచనగా ప్రతి ఏడాది జూన్ 23ను అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లాలో 8 ప్రాంతాల్లో ఒలింపిక్ రన్‌ను నిర్వహించామని తెలిపారు. వందల సంఖ్యలో విద్యార్థులు, క్రీడాకారులు ఈ రన్‌లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారన్నారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో మినీ ఒలింపియాడ్ పోటీలు కూడా నిర్వహించనున్నామని తెలిపారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం కర్రి భామిరెడ్డి ఒలింపిక్ రన్ జ్యోతిని వెలిగించారు. ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రు గోవిందరాజు, సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డిలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడా మైదానం నుంచి జేఎన్టీయూకే వరకూ, తిరిగి జేఎన్టీయూకే నుంచి డీఎస్ఏ వరకూ రన్ కొనసాగింది. ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి రవిరాజు, ఉపాధ్యక్షులు బి.అర్జున్‌రావు, వై.బంగార్రాజు, సభ్యులు కృష్ణమూర్తి, భాస్కర్, పీడీలు వర్మ, జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, డీఎస్ఏ కోచ్‌లు సతీష్‌కుమార్, సురేష్, సమీర్, నాగేంద్ర, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

సామర్లకోట: స్థానిక సంపెంగ తోటలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పుప్పాల నాగగోవిందు, జానీ మోజెస్, దిమ్మల విజయలక్ష్మి, చుక్కా వెంకటరమణ, కూనంశెట్టి అర్జునుడు, బి.రామకృష్ణ, ఇమ్మంది వెంకటేశ్వర్లు, వల్లూరి బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.